ప్రజాశక్తి
ఆదివారం 29 సెప్టెంబర్ 2024
5
శ్రీ సత్యసాయి



నేరాల నియంత్రణపై దృష్టి : ఎస్పీ



స్టేషన్లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి-బత్తలపల్లి

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ వి.రత్న పోలీసు సిబ్బందికి సూచించారు. బత్తలపల్లి పోలీస్ స్టేషన్ను శనివారం ఆమె తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్లో రిసెప్షన్ కౌంటర్, రికార్డుల నిర్వహణ, లాకప్ గదులు, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్లో పట్టుబడి ఉన్న వాహనాలు, ద్విచక్ర వాహనాలు కేసుల వివరాలను ఎస్ఐ శ్రీనివాసులుతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో ముమ్మురంగా పెట్రోలింగ్ చేయడంతో పాటు గస్తీలు ముమ్మరం చేయాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పల్లెనిద్ర చేయడంతో పాటు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మట్కా, పేకాట, గంజాయి, నాటసార తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



ధర్మవరం మున్సిపల్ కార్యాలయం



కమిషనర్ మల్లికార్జున



ధర్మవరం..

కూటమిలో కొట్లాట..!

- ◆ మున్సిపల్ కమిషనర్ చుట్టూ వివాదం
- ◆ బిజెపి, టిడిపి మధ్య ఘర్షణ వాతావరణం
- ◆ మంత్రి కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ధర్మవరంలో తెలుగుదేశం, బిజెపి కూటమి మధ్య గత కొంతకాలంగా కుంపటి రగులుతోంది. ప్రారంభం నుంచి టిడిపి, బిజెపిల మధ్య ఈ ఆదిపత్యపు పోరు నడుస్తూనే ఉంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో అనూహ్యంగా బిజెపి అభ్యర్థిగా సత్యకుమార్ ఇక్కడికి విచ్చేశారు. అంతకు మునుపు వరకు ఆయన కడప జిల్లాకు చెందిన వారిగా ఉంటూ వచ్చారు. ఎన్నికల నామినేషన్ల సమయంలో వచ్చినప్పటికీ టిడిపి సహకారంతో ఇక్కడ బిజెపి విజయం సాధించింది. అంతకు మునుపు వరకు బిజెపికి మాజీ ఎమ్మెల్యే జి.సూర్యనారాయణ ఉండేవారు. ఇటు టిడిపికి పరిటాల శ్రీరామ్ నియోజకవర్గ ఇన్ఛార్జిగా వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికల్లో గోనుగుంట్ల సూర్యనారాయణకు బిజెపి టిక్కెట్టు ఖరారు అని ప్రచారం సాగింది. అయితే చివరి నిమిషంలో ఆయనకు కాకుండా సత్యకుమార్ తెరపైకి వచ్చాడు. సూర్యనారాయణతో ముందు నుంచి ఉన్న విభేదాల నేపథ్యంలో శ్రీరామ్ సత్యకుమార్కు గత ఎన్నికల్లో మద్దతు పలికారు. ఆయన తరుపున ప్రచారం నిర్వహించారు. ఇక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సత్యకుమార్ వైద్యఆరోగ్య శాఖ మంత్రి అయ్యారు. ఈ నేపథ్యంలో అప్పటి వరకున్న టిడిపికి, కొత్తగా అధికారంలోకి వచ్చిన బిజెపికి మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైంది. సత్యకుమార్ మంత్రి అయ్యి నియోజకవర్గానికి వచ్చిన సమయంలో తొలి సమావేశంలోనే టిడిపి, బిజెపి నాయకులు ఘర్షణ పడ్డారు. ఆ తరువాత బత్తలపల్లిలోనూ ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బదిలీ వ్యవహారం టిడిపి, బిజెపి మధ్య పెద్ద ఘర్షణనే రాజేసింది. ఏకంగా టిడిపి శ్రేణులు శనివారం నాడు మంత్రి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. గత వైసిపి పాలనలో మల్లికార్జున టిడిపి నాయకులకు వ్యతిరేకంగా పనిచేయడమే కాకుండా ఏ మాత్రం విలువనివ్వలేదని ఆ పార్టీ నాయకులు మండిపడుతున్నారు. అటువంటి వ్యక్తిని కూటమి ప్రభుత్వ హయాంలో మళ్లీ ఇక్కడికే తీసుకురావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి సత్యకుమార్ తక్షణం మల్లికార్జునను బదిలీ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే అందుకు సత్యకుమార్ సుముఖంగా లేనట్టు తెలుస్తోంది. ఉద్యోగులతో పనిచేయించుకోవాలిగానీ బదిలీలు చేయడం సరైంది కాదని అంటున్నారు. దీంతో ఆయన్ను బదిలీ చేసే వరకు వదిలేది లేదని టిడిపి నాయకులు నిరసనలకు దిగుతున్నారు. ఒకానొక దశలో అటు టిడిపి, బిజెపిల మధ్య మాటాల యుద్ధమే కాకుండా ప్రత్యక్ష దాడులు కూడా జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇది ఎంత వరకు వెలుతుందోనని కూటమి నేతల్లో గుబులు రేపుతోంది. ఇదే కాకుండా ఇతర పనుల విషయంలోనూ టిడిపి, బిజెపి నేతల మధ్య పరస్పరం పోరు నడుస్తోంది. నియోజకవర్గంలో తమ పట్టును నిలుపుకునేందుకు టిడిపి నేతలు ఒకవైపు ప్రయత్నిస్తుండగా, తమ బలాన్ని పెంచుకునేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య కుంపట రాజుకుంది. ఇది ఇంకా ఎంత దూరం వెలుతుందో చూడాల్సి ఉంది. రెండు పార్టీల అధిష్టాలు దీనిపై ఇప్పటికీ పెదవి విప్పలేదు. మౌనంగా వీక్షిస్తుండటం గమనార్హం.

ధర్మవరం బీజేపీ కార్యాలయం ఎదుట టిడిపి నేతల ధర్నా

ధర్మవరం రూరల్ : ధర్మవరం మున్సిపల్ కమిషనర్ నియామకం విషయంపై ధర్మవరం తెలుగు తమ్ముళ్లు ఆందోళనకు దిగారు. కొత్త కమిషనర్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయం ముందు శనివారం నాడు ఆందోళన చేపట్టారు. మంత్రి డౌన్డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో ధర్మవరంలో మున్సిపల్ కమిషనర్గా పని చేసిన మల్లికార్జున మళ్లీ ఇక్కడికి తీసుకురావడం సరికాదన్నారు. ఆయన కమిషనర్గా ఉన్నన్ని రోజులూ టిడిపి నేతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఆ అధికారిని మళ్లీ తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. ఆందోళన విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, 2వ పట్టణ సిఐ రెడ్డప్ప సిబ్బంది అక్కడి చేరుకున్నారు. టిడిపి నాయకులతో మాట్లాడి సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్, వార్డు ఇన్ఛార్జులు పాల్గొన్నారు.



ధర్మవరంలో మంత్రి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు



న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

న్యాయస్థానాలకు భవనాలను సమకూర్చండి

న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం న్యాయస్థాన ఆవరణలో ప్రస్తుతం నిర్వహిస్తున్న న్యాయస్థాన భవన సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు పరిపాలనా న్యాయమూర్తి స్పందించి వెంటనే కోర్టు నిర్వహణకు అనువుగా ఉండే ప్రత్యామ్నాయ భవన సముదాయాలను సమకూర్చాలని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇతర అధికారులను ఆదేశించారు. శనివారం న్యాయమూర్తి కె.శ్రీనివాస్ రెడ్డి అనంతపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ న్యాయవాది జి.శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సుదర్శన్, జిఆర్.సిద్ధూ ఆయన్ను కలిసి కోర్టు భవనాల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన కోర్టుల నిర్వహణకు భవన సముదాయాలను సమకూర్చాలని జాయింట్ కలెక్టర్కు తెలిపారు.

ఉక్కు, గనులు, బొగ్గు శాఖ కమిటీ సభ్యుడిగా పార్థసారధి



పెనుకొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు స్థాయి కమిటీ సభ్యులను నియమించింది. అందులో పార్లమెంటు స్థాయి ఉక్కు, గనులు, బొగ్గు శాఖ కమిటీ సభ్యుడిగా ఎంపి బికె.పార్థసారథిని నియమించింది. ఎంపి బికె మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్కు ధన్యవాదాలు తెలిపారు.



పెనుకొండలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, తదితరులు

దేవున్నీ వదలని చంద్రబాబు : వైసిపి

పుట్టపర్తి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన స్వార్థ రాజకీయాల కోసం దేవున్ని కూడా వదలడం లేదని వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి లడ్డూ వ్యవహారంలో జరుగుతున్న ప్రచారంలో చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా నియోజకవరాల్లో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్తలు ముఖ్య నాయకులు పూజలు నిర్వహించారు. చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు శ్రీవారిని వాడుకోవడం దురదష్టకరం అన్నారు. పాలనలో వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-ధర్మవరంరూరల్

స్వచ్ఛ భారత్కి పారిశుధ్య కార్మికులే వెన్నెముక అని మంత్రి సత్యకుమార్యాదవ్ కితాబునిచ్చారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద వున్న మంత్రి వ్యక్తిగత కార్యాలయంలో శనివారం స్థానిక జెఆర్ సిల్క్స్ అధినేత జింకా రామాంజనేయులు సహకారంతో మంత్రి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ నిర్మాణానికి పారిశుధ్య కార్మికులే స్ఫూర్తి ప్రదాతలు అన్నారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అనంతరం 30 ఏళ్లుగా మున్సిపాలిటీలో సేవలందించిన పారిశుధ్య కార్మికులు ఎస్.సాలమ్మ, ఎం.పెద్దనాగప్ప కాళ్లు కడిగారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు కేశవ, పార్థ, శాంసన్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, డి.చెర్లోపల్లి నారాయణస్వామి, జింకా చంద్ర, గొట్లూరు చంద్ర, సాకే ఓబులేసు, కోటి బాబు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : సిఐ

కొత్తచెరువు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలని సిఐ ఇందిర సూచించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో శనివారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిఐ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రీడల్లో సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు నైపుణ్యం సాధించవచ్చున్నారు. అండర్-17 విభాగంలో ఖోఖో విన్నర్స్ కొత్తచెరువు, రన్నర్స్ నల్లమాడ, కబడ్డీ విన్నర్స్ బుక్కపట్నం, రన్నర్స్ ఒడిసి, వాలీబాల్ విన్నర్స్ బుక్కపట్నం, రన్నర్స్ ఒడిసి, షటిల్ విన్నర్స్ నల్లమాడ, రన్నర్స్ పుట్టపర్తి, చెస్ విన్నర్స్ వెంకటేష్నాయక్(నల్లమాడ), సంతోష్కుమార్, మహేష్, సందీప్(కొత్తచెరువు), కృతిన్ (అమడగూరు), మహమ్మద్ (పుట్టపర్తి). అండర్-14 చెస్ విన్నర్స్ నితిన్రెడ్డి, విశ్వేశ్వరప్రసాద్, మోహన్మురళి (కొత్తచెరువు), నవదీప్నాయుడు(పుట్టపర్తి), షటిల్ విన్నర్స్ సాయికుమార్, అజయ్(పుట్టపర్తి), వరుణ్, సంతోష్(ఒడిసి), వాలీబాల్ విన్నర్స్ పుట్టపర్తి, రన్నర్స్ ఒడిసి, కబడ్డీ విన్నర్స్ కొత్తచెరువు, రన్నర్స్ బుక్కపట్నం. కార్యక్రమంలో పిఇటిలు ప్రభాకర్, వెంకటేష్, రామకృష్ణ, ఓబులేసు, రమేష్, నాగార్జున, ఉష, సూరి, స్వర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు 15 రోజులు గడువు

ఎమ్మెల్యే కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంతో పాటు రూరల్ మండల పరిధిలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు 15 రోజులు గడువు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2021లో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కదిరి రూరల్ మండల పరిధిలోని ముత్యాలచెరువు గ్రామ పొలం సర్వే నెం-86లోని 4 ఎకరాల్లో మున్సిపల్ పంచాయతీ అనుమతి లేకుండా చిన్న చిన్న రోడ్లు వేసి ప్లాట్లు వేసి విక్రయించారన్నారు. ప్రభుత్వ ఆదాయానికి సైతం గండి కొట్టారన్నారు. అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులు చాలామంది తనకు ఫిర్యాదు చేశారన్నారు. 15 రోజుల్లోపు పంచాయతీకి రుసుం చెల్లిస్తే ఆ లేఅవుట్ క్రమబద్ధీక రణకు, ప్రభుత్వం తరపున రోడ్లు, వీధి దీపాలు వంటివి మంజూరు చేస్తారన్నారు. లేనిచో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే హెచ్చరించారు.

ఆరు నెలల్లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోండి

కదిరి టౌన్ : ఇంటి పట్టాలు మంజూరైన లబ్ధిదారులు 6 నెలల్లోపు(మార్చిలోపు) ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం సర్వే నెంబర్ 96, 97, 98 లేఅవుట్లలో గతంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు, హౌసింగ్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకి లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు ఆగిపోవడానికి గల కారణాలు, సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఇప్పటికీ గృహ నిర్మాణ పనులు ప్రారంభించని 954 మందికి మున్సిపల్, రెవెన్యూ అధికారులు వెంటనే నోటీసులు జారీ చేయాలని, అప్పటికీ స్పందించకపోతే వెంటనే పట్టా రద్దు చేయాలని ఆదేశించారు. వచ్చే నెలలో టిడ్కో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్కుమార్, కౌన్సిలర్లు ఫయాజ్, ముస్తఫా, రంగారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు కెఎస్.బహవుద్దీన్, అయూబ్ఖాన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మిషనరీ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తాం

కదిరిటౌన్ : వైసిపి హయాంలో అధికారం అడ్డుపెట్టుకొని క్రిస్టియన్ మిషనరీ ఆస్తులను కాజేసిన విషయంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం పట్టణంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో అధికారం అడ్డం పెట్టుకొని సిఅండ్ఐజి క్రిస్టియన్ మిషనరీకి చెందిన భూమిని అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు తెర వెనక ఉండి ఫోర్జరీ సంతకాలు చేసి, నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించారని ఆరోపించారు. వారిపై బెంగళూరులో కూడా క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. ఎన్నికల అనంతరం అధికారం కోల్పోగానే పరారయ్యారని తెలిపారు. ప్రజలకు వాస్తవాలు తెలియడం కోసం, నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు కోర్టులో ప్రయివేట్ కేసు నమోదు చేయించి సిట్టింగ్ జడ్జితో విచారణ కోరతామని తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా ఆదాయంతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు రావు తెలిపారు. అనంతపురం కార్పొరేషన్లో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న సంఘం శ్రీనివాసులు హిందూపురం కమిషనర్గా బదిలీపై వచ్చి, శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే ఆదాయం, పారిశుధ్యం నిర్వహణపైనే ఆధారం అన్నారు. మున్సిపాల్టీకి ఆదాయాన్ని పెంచి ప్రజలకు మౌలిక వసతుల కల్పినకు కృషి చేయనున్నట్లు చెప్పారు. బాధ్యతలను స్వీకరించిన కమిషనర్కు ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎ బాలాజీ, టిడిపి కౌన్సిలర్లు, మున్సిపల్ కాంట్రాక్టర్లు, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కమిషనర్ కు పుష్పగుచ్చం అందించి అభినందిస్తున్న బాలకృష్ణ పిఎ బాలాజీ, టిడిపి కౌన్సిలర్లు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎస్.సుజైన్

ప్రజాశక్తి-నల్లచెరువు

ఇటీవల అనంతపురం నగరంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో నల్లచెరువు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎస్.సుజైన్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పిడిలు వి.షఫీ, సంధ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థిని ఎస్.సుజైన్ అండర్-17 విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో 3వ స్థానం, 4ఐ100 పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. సుజైన్ శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. తమ పాఠశాల నుంచి మరికొందరు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. అండర్-17 విభాగం బాలికల కబడ్డీలో ఎస్.సుజైన్, సిరివెన్నెల, బాలుర విభాగంలో చరణ్సాయి, వేణు, నాగేంద్ర, అండర్-14 బాలికల కబడ్డీలో స్పందన, వెన్నెల, బాలికల విభాగంలో విక్రమ్, నందకుమార్. అండర్-17 బాలికల ఖోఖోలో హాసిని, అండర్-14 బాలికల ఖోఖోలో ఫిరదౌస్, షాహనాజ్, అప్సానా, అండర్-14 బాలుర విభాగంలో ధనుష్ ఎంపికైనట్లు తెలిపారు. యోగాలో గౌస్పీర్, సత్యవేలు, చెస్లో అలేఖ్య, అండర్-17 విభాగంలో హర్షవర్ధన్రెడి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం కె.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనాథ్రెడ్డి, గౌస్ఖాన్, సుబహాన్, అశోక్రెడ్డి, అనిత, సుజన, రెడ్డమ్మ, లక్ష్మీదేవి అభినందించారు.

భగత్సింగ్కు ఎస్ఎఫ్ఐ నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

విప్లవ నాయకుడు సర్దార్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయనకు నివాళులు అర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలీ మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం నేటి యువతరానికి, విద్యార్థులకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శికుమార్, అభి, చరణ్, భగత్, రాంప్రసాద్, గణేష్, ప్రభుదేవు, హరీష్, గిరీష్, భానుప్రసాద్, లోకేష్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నిజం చేస్తాం

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, పేదల సొంతింటి కల నిజం చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి లే అవుట్ గృహ నిర్మాణ లబ్ధిదారులతో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్రెడ్డి, హౌసింగ్ పిడి వెంకటనారాయణ, కమిషనర్ ప్రహ్లాద, డిఈ వెంకటనారాయణరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో 16,701 ఇళ్లు మంజూరు కాగా అందులో 2,528 ఇళ్లు పూర్తి చేయలేదన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 1347 ఇళ్లు మంజూరు కాగా కేవలం 140 ఇళ్లు పునాదులకే పరిమిత మయ్యాయి అన్నారు. పైకప్పు వరకూ నిర్మించిన లబ్ధిదారులు నెలలోపు పూర్తి చేసుకోవాలన్నారు. మిగిలినవి మార్చి లోపు పూర్తి చేసుకోవాలన్నారు. పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖ నుంచి ఎలాంటి బిల్లులు పెండింగ్ లేకుండా ఆ శాఖ అధికారులు వెంటనే ఇస్తారని, త్వరగతిన ఇళ్లు పూర్తి చేసుకోవాలన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు రామాంజనేయులు, విజయకుమార్, పుడా మాజీ చైర్మన్ కడియాల సుధాకర్, మాజీ ఎంపీపీలు శ్రీరామ్రెడ్డి, రాములమ్మ, నాయకులు సామకోటి ఆదినారాయణ, పుల్లప్ప, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఓ బాధ్యత

ప్రజాశక్తి-హిందూపురం

ఉపాధ్యాయ రంగం వృత్తిగా భావించకుండా సామాజిక బాధ్యతగా గుర్తెరగాలని ఎంఇఒలు తెలియజేశారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అవార్డు పొందిన ఉపాధ్యాయులను యుటిఎఫ్ ఆద్వర్యంలో రోటరీ క్లబ్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా మారుతీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి, లక్ష్మీదేవి, శ్రీ శేషాచలం, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించి వారిని ప్రయోజకులు చేయడంలో ఉపాధ్యాయులు పాత్ర ఎనలేనిదన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు శేషగిరిబాబు, జిఆర్.శ్రీనివాసులు, పిఎన్.ప్రసాద్, రామాంజనేయులు, కమలమ్మ, చంద్రమౌళేశ్వర గుప్త, శ్రీదేవి, శంకర్ నాయక్లను సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బాబు, సీతాలక్ష్మి, మహంతీశ్వర, చెన్నకేశవులు, రామకృష్ణ, హనుమంతప్ప, అనిల్, సురేష్ పాల్గొన్నారు.



సన్మానించిన ఉపాధ్యాయులతో యుటిఎఫ్ నాయకులు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



సీసీ రోడ్డు, డ్రెయినేజీ కాలువ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక బిసి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే శనివారం కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ కాలువ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పనులను సకాలంలో నాణ్యతగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. విద్యుత్ లైన్ లేక ఇబ్బందులు పడుతున్నామని వేణుగోపాల్‌కాలనీ, కొండ సమీప కాలనీవాసులు తెలుపగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయా కాలనీ లను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సిఎం జగన్ గత ఐదేళ్లలో ఎన్నడూ సతీ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించకుండా తిరుమల వెంకటేశ్వ రస్వామిని అగౌరవపరిచారన్నారు. డిక్లరేషన్ కూడా ఇవ్వకుండా సనాతన సంప్రదాయాలను నీరు కారుస్తున్నారన్నారు. అనంతరం వరద బాధితుల కు మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ రూ. 50వేల చెక్కును సిఎం సహాయ నిధికి అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపిడిఒ బరాన్ సాహెబ్, సిఐ ఇందిర, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయ కులు మాణిక్యం, బాబా, రఘుపతి, ప్రసాద్, శివప్రసాద్, వెంగప్ప, ఆర్.నాగేంద్ర, కిరణ్, వంశీకిషోర్, సురేష్, రమేష్, డిపో భాస్కర్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి టిడిపి నాయకుల సన్మానం

శ్మశానవాటిక ఏర్పాటుకు పుట్టపర్తి రోడ్డులో స్థలం కేటాయించినందుకు పార్కు వద్ద ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిలను టిడిపి నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో శ్మశానవాటికలో పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేస్తామన్నారు. పార్కును కూడా అన్ని విధాలా అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లక్ష్మీనారాయణ, నాయకులు శివప్రసాద్, రఘుపతి, ఆర్.నాగేంద్ర, వెంగప్ప, రాఘవ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కళలు, సాహిత్యంపై సదస్సు

ప్రజాశక్తి-గోరంట్ల



కూచిపూడి చేసిన చిన్నారికి జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయలు జూనియర్ కళాశాలలో శనివారం సాహితీ సాంస్కృతిక వేదిక ఏర్పాటు చేశారు. ఇందులో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం అధ్యక్షతన కళలు, సాహిత్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళలు, సాహిత్యం, వినోదం, మ్యాజిక్ షో, మిమిక్రీ, రంగస్థల పద్యాలు, సమాజసేవ, నైతిక విలువలు, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకత, కళలను వెలికితీయడానికి సాహితీ సాంస్కృతిక వేదికలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కోగిర జయచంద్రరెడ్డి చెప్పిన కాకి కథ, చలి మంటలు కథలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు లాస్య, గ్రీష్మ బాయి చేసిన కూచిపూడి, భరతనాట్యం అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సేద్యం సినిమా నిర్మాత జిఎం సురేష్, నిర్వాహకులు జగదీష్, నరెద్దుల రాజారెడ్డి, ఉపాధ్యాయుడు శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా జయంతి

ప్రజాశక్తి-పెనుకొండ



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేదిక సభ్యులు

సామాజిక సంస్కర్త గుర్రం జాషువా జయంతి సందర్భంగా శనివారం బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ మాట్లాడుతూ కవి సామ్రాట్‌గా పేరు గాంచిన జాషువా ఆనాడు తన రచనలతో సమాజంలో నెలకొన్న సాంఘిక దురాచారాలను రూపుమా పేందుకు కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో వివక్ష, అసమానతలు ఉన్న చోట బహుజన చైతన్య వేదిక పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షుడు వెంకటేష్, రవిబాబుప్రసాద్, ఉపాధ్యక్షులు సిహెచ్.ఈశ్వర్, నరేష్, రవికుమార్, పోతన్న, రామాంజనేయులు, కోఆర్డినేటర్ నరసింహులు, పాల్గొన్నారు.

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సోమందేపల్లి



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేదిక సభ్యులు

స్థానిక పాత హైస్కూల్‌లో శనివారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పెదపల్లి బాబా, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సిఐటియు మండల కమిటీని ఎన్నుకు న్నారు. మండల కన్వీనర్‌గా రాజగోపాల్, కో కన్వీనర్‌గా రాజుతోపాటు పదిమందితో కమిటీని నియ మించారు. నాయకులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కార్మికులను ఏకం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని పిలుపునిచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసేలా విధానాలు తీసుకొస్తున్నా యని, వాటిపై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు నారాయణస్వామి, కొత్తపల్లి కిష్టప్ప, ఆటో కార్మికులు మహేష్, రవి, ఆంజనే యులు, జగదీష్, భవన నిర్మాణ కార్మికులు నారాయణప్ప, రాజు, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రకారుడు మైనాస్వామికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-పుట్టపర్తిరూరల్



అవార్డు అందుకుంటున్న చారిత్రకారుడు మైనాస్వామి

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎపి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయ వాడలో నిర్వహించిన పర్యాటక దినోత్సవ వేడుకల్లో చరిత్రకారుడు మైనాస్వామికి ఉత్తమ అవార్డు ప్రదానం చేశారు. చరిత్రకారుడు మైనాస్వామి రచించిన 'ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్ ఆఫ్ విజయనగర– లేపాక్షి' ఆంగ్ల పుస్తకానికి ఉత్తమ అవార్డు వచ్చినట్లు ఆయన తెలిపారు. విజయనగర సామ్రాజ్య సంస్కృతి, వైభవానికి ప్రతీక అయిన 'లేపాక్షి' పుస్తకాన్ని తెలుగు భాషలో ప్రచురించగా పాఠకుల నుంచి మంచి ఆదరణ లభించిందని తెలిపారు. 'లేపాక్షి' పుస్తకం కన్నడ, ఆంగ్ల భాషల్లో కూడా ప్రజల ముందుకు వచ్చిందన్నారు. గత జనవరిలో ప్రధాని మోడీ లేపాక్షి ఆలయానికి వచ్చినప్పుడు మైనాస్వామి గైడ్‌గా ఉండి ఆలయ శిల్పకళ, తైలవర్ణ చిత్రాల గురించి వివరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం



ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

రూరల్ మండలంలోని సి.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక య్యారు. వాలీబాల్‌లో జి.గణేశ్, జునైద్, అరుణ్, 200 మీటర్స్ పరుగు పందెంలో మనోజ్, సతీష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అశోక్‌నాయక్ తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే పట్టణంలోని ఎంజిఎం హై స్కూల్ క్రీడా మైదానంలో శనివారం మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా 6వ వార్డు కౌన్సిలర్ డిఈ.రమేష్‌కుమార్, హిందూపురం ఎంఇఒ–1 గంగప్ప, ఎమ్మెల్యే పిఎ బాలాజీ, హెచ్‌ఎం సామ్రాజ్యం హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అండర్–14, అండర్–17 బాల బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పిడిలు రామకృష్ణ, సురేష్‌కుమార్, శ్రీనివాసులు, నాగమణి, సరళ, వివిధ పాఠశాలల పిడిలు, పిఇటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కోగిర విద్యార్థులు

రొద్దం : స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి పోటీలకు మండంలోని కోగిర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.నారాయణరెడ్డి తెలపారు. ఇటీవల ఎపిఆర్‌ఎస్ కొడిగెనహళ్లిలో జరిగిన డివిజినల్ పోటీల్లో కోగిర ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని తెలిపారు. అందులో బి.ఎ.గోపీచంద్ ఆట తీరును చుసిన అధికారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసారని వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీదేవి తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు వెంకటేశులు, పోతుల య్య, జాబిలి చాంద్ బాషా, రమేష్, హసీన, రామంజనేయులు, ఆది అభినందించారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన కోగిర విద్యార్థులు



సబ్ రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

పురం సబ్ రిజిస్ట్రార్‌గా రాజశేఖర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సబ్ రిజిస్ట్రార్‌గా రాజశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన కర్నూలు జిల్లా ఆదోని నుంచి ఇక్కడికి వచ్చారు. నూతన సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఉద్యోగులను సమన్వయం చేసుకుని ప్రభుత్వ ఆదాయం పెంచడానికి కృషి చేస్తానన్నారు. హిందూపురం రియల్ ఎస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రియాజుల్లా ఆధ్వర్యంలో సభ్యులు సబ్ సబ్ రిజిస్ట్రార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోయేషన్ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, సెక్రటరీ ఉత్తన్న, జాయిట్ సెక్రటరీ రియాజ్, ట్రెజరర్ నూరుల్లా, జబీవుల్లా, రామాంజి, వలి, యాకుబ్, వాహిద్, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట ట్రాన్స్‌కో ఏఈగా శ్రీనివాసులు


ప్రజాశక్తి-గాండ్లపెంట



మండల ట్రాన్స్‌కో ఏఈగా ఎన్‌కె.శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గోరంట్ల మండల ఏఈగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఏఈ మాట్లాడుతూ మండ లంలోని గాండ్లపెంట, గాజులవారిపల్లి, మల్లమీదపల్లి విద్యుత్ సబ్ స్టేషన్లను పరిశీలించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. ప్రధానంగా రైతులకు అందుబాటులో ఉండి విద్యుత్ సరఫరాలో సమస్యలు రాకుండా బాధ్యతగా పని చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, లైన్‌మెన్ రెడ్డిబాషా, అంజి, సిబ్బంది పాల్గొన్నారు.

సికెపల్లి ఎస్‌ఐగా సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి : మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా శనివారం సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో విఆర్‌లో ఉన్న సత్యనారాయణను ఇక్కడికి బదిలీ చేశారు. నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మట్కా, పేకాట, గంజాయి, నాటుసారా, కర్నాటక మద్యం, ఇసుక అక్రమ తరలింపు వంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



లేపాక్షి ఎస్‌ఐగా నరేంద్ర

లేపాక్షి : మండల నూతన ఎస్‌ఐగా నరేంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అలాగే మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు పూలబొకేలు ఇచ్చి సత్కరించారు. నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల విషయంలో రాజీ పడకుండా పని చేస్తానన్నారు. మట్కా, పేకాట, జూదం, తదితర అసాంఘిక కార్యకలాపాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు.



ఎర్రబల్లిలో ఉచిత వైద్య శిబిరం

ఓబుళదేవరచెరువు : మండలంలోని ఎం.ఎర్రబల్లి గ్రామంలో బాలికకు డెంగీ జ్వరం సోకడంతో శనివారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే దోమల నివారణకు వీధుల్లో ఫాగింగ్ చేశారు. దోమ కాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. ఇలు, పెరడు, పరిసరాల్లోని నీటి తొట్టెల్లో లార్వా నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి తొట్టెలను శుభ్రం చేసుకొని, ప్రతి ఫ్రైడే డ్రై డేగా పాటించాలని వివరించారు. కార్యక్రమంలో మలేరియా ఆఫీసర్ దేవ్లానాయక్, సూపర్వైజర్లు శశిధర్, విజయకుమారి, ఆరోగ్య సిబ్బంది బిందుభార్గవి, మద్దిలేటి, మనోహర్, శ్రీనివాసులురెడ్డి, అఖిల, సురేంద్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేటెడ్‌పై నిరాశ..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులపై చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అందులో చాలా మంది గత ఎన్నికల్లో ఎమ్మెల్యే స్థానాలను సైతం వదులు కున్న వారున్నారు. మరికొంత మంది సీనియర్లుగానున్న వారూ ఉన్నారు. వారందరికీ న్యాయం జరుగుతుందని ఆశించారు. అయితే నామినేటెడ్ పదవుల పంపకాలు ఇటీవలే జరిగాయి. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కేవలం ఒక్కటే ఛైర్మన్ స్థానం రాగా ఐదుగురికి సభ్యులుగా నియమించారు .సభ్యులుగా నియమించిన వారిలో ఇద్దరు సీనియర్ నాయకులుగానున్నారు. గోనుగుంట్ల విజయ్‌కుమార్, కాటమయ్యలు సీనియర్లు. వీరు ఛైర్మన్ స్థానాలను ఆశించిన వారిలోనూ నున్నారు. వీరికి కేవలం సభ్యులుగా నియమించడం పట్ల వారి మద్దతుదారులు బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సభ్యులుగా నియమించే కంటే ఇవ్వకున్నా బాగుండున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఇకపోతే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఐదుగురు మాజీ ఎమ్మెల్యేలు తమ స్థానాలను వదులుకున్నారు. వారికి తగిన ప్రాధాన్యతనిస్తామని ఆ సమయంలో ప్రకటించారు. కాని వారిలో ఏ ఒక్కరికీ నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించలేదు. ప్రధానంగా ధర్మవరం అసెంబ్లీ స్థానాన్ని వదులుకున్న పరిటాల శ్రీరామ్‌కు శాప్ ఛైర్మన్ పదవి లభిస్తుందని పెద్దఎత్తున ప్రచారం సాగింది. ఎందుకంటే ధర్మవరంలో టిడిపి నాయకులెవరూ లేని సమయంలో ఆయన్ను అక్కడ ఇన్‌ఛార్జీగా నియమించారు. చివరి నిమిషంలో ఆ స్థానాన్ని బిజెపికి అప్పగించారు. అయినా సర్దుకుని బిజెపికి మద్దతుగా ఎన్నికల్లో ప్రచారం చేసి, విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇటువంటి సమయంలోనూ టిడిపిని అక్కడ నడిపించే బాధ్యత ఆయనపైనే ఉంది. ఇటువంటి వ్యక్తికి నామినేటెడ్ ఇవ్వకపోవడంపై వారి మద్దతుదారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇక మడకశిర నియోజకవర్గంలో ఈరన్న కుమారుడు డాక్టర్ సురేంద్రకు టిక్కెట్టు ప్రకటించి చివరి నిమషంలో మార్పు చేశారు. వారికి కూడా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తారని ఆశించారు. కాని కూడా నిరాశనే ఎదురైంది. గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ గడిచిన ఐదేళ్లు పార్టీని నడిపిస్తూ వచ్చారు. ఆయనకు కాకుండా చివరి నిమిషంలో మార్పు చేసి వైసిపి నుంచి టిడిపి చేరిన కర్నూలు నాయకులు గుమ్మనూరు జయరాంకు అవకాశం కల్పించారు. ఇక అనంతపురం నగరంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరికి సీటు ఇవ్వలేదు. దగ్గుపాటి ప్రసాద్‌కు ఇచ్చారు. అయితే ప్రభాకర్‌చౌదరికి నామినేటెడ్ పదవీ ఏదీ దక్కలేదు. అనంతపురం పార్లమెంటు గతంలో పోటీ చేసిన జెసి.పవన్‌కుమార్‌రెడ్డికి ఈసారి టిక్కెట్టు లేదు. ఈయనకు నామినేటెడ్‌లో చోటు లభించలేదు. ఇంత మంది సీనియర్లు పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. వీరందరికీ గత ఎన్నికల్లో టిక్కెట్టు కూడా ఇవ్వలేదు. మార్పులు చేశారు. వీరు విజయంలోనూ తమ వంతు పాత్రను పోషించారు. వీరందరికీ ఏ రకంగా పదవుల్లో న్యాయం చేయనున్నారన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో నడుస్తోంది.

ఆధునిక వైద్య సేవలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి

ఆధునిక వైద్య సేవలపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ డా. ఎం. ప్రగతి సూచించారు. పట్టణంలోని ఎన్‌ఎస్ పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర–2047, మీ విజన్–మా మిషన్‌లో భాగంగా సాంకేతికతతో కూడిన అందుబాటులో ఉండే వైద్యంపై విద్యార్థినుల కు అవగాహన కల్పించారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామాలతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే, ఆధునిక వైద్య సదుపాయాలు, సేవలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తీసుకోవాలన్నారు. అనంతరం భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ డా. శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదును జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పెనుకొండ

అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే టిడిపి సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు ప్రక్రియపై మండల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదును పెద్దఎత్తున చేపట్టాల న్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాధవనాయుడు, మునిమడుగు వెంకటరాముడు, చంద్రమౌళి, శ్రీనివాసులు, మండల కన్వీనర్లు సిద్దయ్య, సిద్దలింగప్ప, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



స్వచ్ఛ ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని గొట్లూరు గ్రామంలో ఉన్న కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డా. కె.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గొట్లూరు గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, నిర్వహణ ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామ సచివాలయ పరిసరాల్లో చెత్త చెదారం, ముళ్ల కంపలు తొలగించి శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుత ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.షమీవుల్లా, బి.గోపాల్‌నాయక్, బి.ఆనంద్, వై.తాహిర్‌అలీ, పంచాయతీ కార్యదర్శి పి.గణేష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తహశీల్దార్ మారుతిని సన్మానించిన టిడిపి నాయకులు

తహశీల్దార్‌ను కలిసిన టిడిపి నాయకులు


ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం నూతన తహశీల్దార్ మారుతిని మండల టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలకృష్ణచౌదరి, నరేష్, ఉత్తమరెడ్డి, నిమ్మల శ్రీధర్, పచ్చ అశోక్, హరి, అజంతుల్లా, రాఘవనాయుడు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-లేపాక్షి

ఎన్నో ఏళ్లుగా స్థానిక దుర్గా వీరభద్రస్వామి ఆలయ విశిష్టతను పర్యాటకులకు తెలియజేసే ఆలయ గైడ్ విరూపన్న శుక్రవారం విజయవాడలో రాష్ట్ర పర్యాటక ఉత్తమ అవార్డు అందుకున్నారు. దీంతో ఆయనను శనివారం లేపాక్షి ఆలయ ఛైర్మన్ కరణం రమానందన్, ఆలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అలాగే నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శీనస్వామి, సింహస్వామి, రాము, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు



విరూపన్నను సన్మానిస్తున్న రమానందన్

తహశీల్దార్‌ను కలిసిన టిడిపి నేతలు



తహశీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న నేతలు

బత్తలపల్లి : నూతన తహశీల్దార్ స్వర్ణలతను శనివారం మండల టిడిపి, బిజెపి నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వారు మండలంలో నెలకొన్న భూ సమస్యలను తహశీల్దార్‌కు వివరించి సత్వరమే పరిష్కరించాలని కోరారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులునాయుడు, బిజెపి మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, నెట్టెం రామకృష్ణ, ముసుగు రామచంద్ర, నాయకులు జక్కంపూడి నాగభూషణం, సూరి, సతీష్, మధు, నాగేంద్ర, కృష్ణారెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో షాపులకు టెండర్ల ఆహ్వానం

కదిరి టౌన్ : కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లో షాపుల నిర్వహణ, ఖాళీ స్థలాల అద్దెకు సంబంధించి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు శనివారం అసిస్టెంట్ డిపో మేనేజర్ ఎస్.హరిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ డిపో బస్టాండ్ వద్ద షాపుల నిర్వహణకు సంబంధించి అక్టోబర్ 4వ తేదీ వరకు టెండర్ ఫారాలు ఇస్తామని, 5వ తేదీ లోపు టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థుల ర్యాలీ

మడకశిర రూరల్ : స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను పట్టణ కూడలిలో, అనువైన చోట ఏర్పాటు చేయాలని శనివారం శనివారం లోక కళ్యాణ్ ప్రజాసాక్షి సమితి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్థానిక జడ్పీ హైస్కూల్ బాలికల, సిద్దార్థ, మాత పాఠశాలల విద్యార్థులతో పాటు సమితి ప్రతినిధులు పాల్గొన్నారు

సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ

సోమందేపల్లి : స్థానిక స్నేహలతనగర్‌లో శనివారం టిడిపి మండల కన్వీనర్ సిద్ధలింగప్ప ఆధ్వర్యంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేసింద న్నారు. కార్యమకంలో టిడిపి టౌన్ కన్వీనర్ సూరి, నాయకులు కిష్టప్ప, శరత్ చంద్రారెడ్డి, శివప్ప, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమ్మరపేటలో నీటి ఎద్దడి

తలుపుల : మేజర్ పంచాయతీ పరిధిలోని కుమ్మరపేటలో తాగు నీటి సమస్య తీవ్రమైంది. 4 రోజులుగా తాగునీటి సరఫరా ఆగిపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు.

రాయితీపై ఉలవలు పంపిణీ

సోమందేపల్లి : మండలంలోని బ్రహ్మసముద్రం రైతు సేవ కేంద్రంలో శనివారం టిడిపి మండల కన్వీనర్ సిద్ధ లింగప్ప ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేశారు. సిద్ధలింగప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు, డీలర్ ఆదిశేషప్ప, నాయకులు శ్రీరాములు, జనసేన మండల కన్వీనర్ మహేష్, ఎం.మొద్దన్న, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

గుడిబండ : మండలంలోని ఎస్‌ఎస్.గుండ్లు గ్రామంలో శనివారం రెండేళ్ల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి బకెట్‌లో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రైతు జయరామ్ దంపతులకు రెండేళ్ల కూతురు ఉంది. చిన్నారి తల్లి ఇంట్లో వంట పనుల్లో నిమగ్నమై ఉండగా చిన్నారి ఇంటి బయట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ నీరు ఉన్న బకెట్లో పడిపోయింది. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన చిన్నారిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు తెలిపారు. చిన్నారి తల్లిదండ్రులు బోరున విలపించారు.

పేకాటజూదరులు అరెస్ట్

తనకల్లు : మండలంలోని కోటూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం దాడులు చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేసి పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 10,165 స్వాధీనం చేసుకొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

తనకల్లు : మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ గోపి హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు శనివారం ఆటో యజమానులు, డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాలకు రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, ఖాకీ చొక్కా ధరించాలని, అధిక లోడు తరలించరాదని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు నారాయణస్వామి, వెంకటేష్, రవి, లోకేష్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : ఎంపిడిఒ

పెనుకొండ : మండలంలో అసంపూర్ణంగా ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ శివశంకరప్ప ఆదేశించారు. మండలంలోని ఆడదాకులపల్లిలో శనివారం 'మన ఇల్లు.. మన గౌరవం' అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి పెండింగ్ బిల్లులు తీసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మార్చి నాటికి నిర్మాణాలన్నీ పూర్తి కా వాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, నాయకులు ప్రసాద్, రంగనాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డాక్టర్ బత్తల ఆర్థిక సాయం

కదిరి టౌన్ : రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన చిన్న రెడ్డన్న మృతిచెందాడు. దీంతో వైసిపి రాష్ట్ర బిసి విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 10వేలను శనివారం చిన్న రెడ్డన్న కుటుంబ సభ్యులకు డా. బత్తల వెంకటరమణ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో రామ్‌ప్రసాద్, కాంట్రాక్టర్ బాబా, చికెన్ జకీర్, ముబారాక్ పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో ఘనంగా క్రీడా దినోత్సవం

గోరంట్ల : పట్టణంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం క్రీడల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగాగా సిఐ శేఖర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో పాల్గొని నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. ప్రతి విద్యార్థి తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.